క్లుప్తంగా

నేడు భీమదేవరపల్లికి మంత్రి 'పొన్నం' రాక

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆదివారం రానున్నట్లు జేఏసీ మండల చైర్మన్ డ్యాగల సారయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గాంధీనగర్, మాణిక్యాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవంలో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మేధావులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'నీట్' లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి

ఐనవోలు: దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష పత్రాలను లీకేజీ చేసిన వారిపై మోదీ ప్రభుత్వం వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకు అప్పగించాలని కోరారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

యువత వ్యసనాలు వీడాలి



దామెర: యువత వ్యసనాలు వీడి సన్మార్గంలో పయనించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో శనివారం జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయి, గుట్కా, మద్యం వంటి చెడువ్యసనాల బారిన పడి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆపద సమయంలో 100 టోల్ ఫ్రీకి కాల్‌చేసి సాయం పొందాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళా బృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

పర్వతగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎద్దు రాహుల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం మండలంలోని ఏనుగల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించి సమస్యలపై అధ్యయనం చేసింది. అనంతరం రాహుల్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. తాగునీటి సౌకర్యం కూడా లేదని, ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, విష్ణు, ప్రశాంత్, అశ్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలైన సంఘటన మండలకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ధర్మసాగర్‌కు చెందిన నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో మేడారం వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో మండలకేంద్రం సమీపంలో రోడ్డుపక్కన ఆటో నిలిపి పక్కన చేనులో వంట చేసుకుంటుండగా హనుమకొండకు చెందిన రాజేష్, సిరి దంపతులు కారులో ములుగు వైపు వెళ్తుండగా ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టడంతో ఆటో, కారు పల్టీలు కొట్టాయి. ఈ సంఘటనలో కారులో ఉన్న సిరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

గురుకులాల్లో నాణ్యమైన భోజనం అందించాలి

విద్యారణ్యపురి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం అందించాలని ఎంఎస్ఎఫ్ బాధ్యులు కోరారు. హనుమకొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల ఆర్‌సీఓ విద్యారాణిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. నాణ్యతగల సరుకులను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తరగతులు సక్రమంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. కుమ్మరి శ్రీనాథ్, నాయకులు పాల్గొన్నారు.

నేరెళ్లవాగు బ్రిడ్జికి మోక్షమెప్పుడో !

- కూలిపోయి ఏడాది గడుస్తున్నా పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్
- భారీ వర్షాలు కురిస్తే మట్టికొట్టుకు పోయే ప్రమాదం
- బీటీ వేసి బ్రిడ్జి నిర్మించాలంటున్న ప్రజలు



గతేడాది వచ్చిన భారీ వరదతో కొట్టుకుపోయిన బ్రిడ్జి



బీటీ వేయకుండా వదిలేసిన కంకర రోడ్డు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

వేలేరు : గుండ్లసాగర్, వెంకటాద్రిపేట గ్రామాలను కలుపుతూ నేరెళ్లవాగుపై నిర్మించిన బ్రిడ్జి కూలిపోయి ఏడాది గడుస్తున్నా అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గుండ్లసాగర్ నుంచి చిల్పూర్ మండలం వెంకటాద్రిపేట వెళ్లే దారిలో నిర్మించిన బ్రిడ్జి కూలిపోయింది. గుండ్లసాగర్ నుంచి వెంకటాద్రిపేటకు రోడ్డు వేయడానికి 4 కిలోమీటర్ల బీటీ వాగుపై వంతెన నిర్మించడానికి సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గుండ్లసాగర్ పాఠశాల నుంచి నేరెళ్లవాగు వరకు రూ.1 కోటి 10 లక్షలు, నేరెళ్లవాగు నుంచి వెంకటాద్రిపేట వరకు సుమారు రూ.1కోటి 90 లక్షల నిధులు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రస్తుత జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ధర్మారెడ్డి అధికారుల వెంటపడి 2022లో నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. గుండ్లసాగర్ నుంచి వెంకటాద్రిపేట వరకు ఫార్మేషన్ రోడ్డు (మట్టిరోడ్డు, దానిపై కంకర పోసి తొక్కించడం)పూర్తయింది. ఈ రోడ్డు మధ్యలో ఉన్న వాగు(నేరెళ్లవాగు)పై బ్రిడ్జిని నిర్మించారు. ఫార్మేషన్ రోడ్డు, వంతెన నిర్మాణ పనులను 2023 సంవత్సరంలోనే పూర్తి చేశారు. ఈ రోడ్డుపై బీటీ వేయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పటివరకు బీటీ రోడ్డు వేయలేదు.

రోడ్డుపై కంకరపోసి వదిలేశారు

రోడ్డుపై కంకరపోసి వదిలేయడంతో ఆ దారిగుండా వెళ్లే ప్రయాణికులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేరెళ్లవాగు బ్రిడ్జి 2023 ఆగస్టులో వచ్చిన భారీ వర్షాలకు వాగులో వరద ఎక్కువగా రావడంతో బ్రిడ్జి కూలిపోయింది. వంతెన నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతోనే కూలిపోయిందని గ్రామస్తులు, రైతులు ఆరోపిస్తున్నారు.

రెండేళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు



గుండ్లసాగర్ నుంచి వెంకటాద్రిపేటకు వెళ్లే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతనగా ఉంది. గతంలో కట్టిన బ్రిడ్జిని తొలగించి అదేస్థానంలో పిల్లర్లు వేసి కొత్త బ్రిడ్జి నిర్మించాలి.

– ఎస్.మహేష్, గుండ్లసాగర్ గ్రామస్తుడు

బ్రిడ్జితో నష్టం వాటిల్లింది



వాగుపై నిర్మించిన బ్రిడ్జితో నాకు తీవ్ర నష్టం జరిగింది. వాగు పక్కనే పొలం ఉండటంతో గతంలో కురిసిన భారీ వర్షాలకు వరదలు వచ్చి బ్రిడ్జి కూలిపోవడంతో పక్కనే ఉన్న నా భూమి 20 గుంటల పొలం కొట్టుకుపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. కొత్త బ్రిడ్జి కట్టిస్తే నా పొలంలో గుంతలను పూడ్చివేసుకోవచ్చు.

– శివరాత్రి వెంకటయ్య, రైతు గుండ్లసాగర్

'సాకేత'లో బుక్స్, యూనిఫాం పట్టివేత

- హైస్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డీఎస్ఏ నాయకుల ఆందోళన
- స్టేషనరీని సీజ్ చేసిన ఎంఈఓ



పట్టుకున్న యూనిఫాం, స్టేషనరీతో ఆందోళన చేస్తున్న డీఎస్ఏ నాయకులు

కమలాపూర్: మండలంలోని అంబాల గ్రామంలో సాకేత హైస్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ బుక్స్, యూనిఫాం, స్టేషనరీ విక్రయిస్తుండగా డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ (డీఎస్ఏ) నాయకులు శనివారం పట్టుకున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న సాకేత హైస్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టుకున్న స్కూల్‌బుక్స్, యూనిఫామ్స్, స్టేషనరీతో స్కూల్ ఆవరణలోనే ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రావణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లలో స్కూల్‌బుక్స్, యూనిఫామ్స్, స్టేషనరీ వంటివి విక్రయించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలకు విరుద్ధంగా సాకేత హైస్కూల్ యాజమాన్యం స్కూల్‌లోని ఓ గదిలో బుక్స్, యూనిఫామ్స్, స్టేషనరీ వంటివి నిల్వచేసి అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే డీఈఓ, ఎంఈఓలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా డీఈఓ, ఎంఈఓలు స్పందించి సాకేత హైస్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డీఈఓ, ఎంఈఓలు ఇక్కడకు వచ్చి స్కూల్ గుర్తింపు రద్దు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. చివరకు డీఎస్ఏ నాయకుల ఫిర్యాదు మేరకు ఎంఈఓ రాంకిషన్‌రాజు సాకేత స్కూల్‌కు చేరుకుని స్కూల్ బుక్స్, యూనిఫామ్స్, స్టేషనరీని సీజ్ చేశారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర కో కన్వీనర్లు గణేష్, ఉప్పుల శివ, నాయకులు రవికుమార్, అనిల్, కార్తీక్, హతీరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి విద్యుత్ మీటరు బిగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీ రఘు

శాయంపేట : ప్రతీ ఇంటికి విద్యుత్ శాఖ నుంచి అధికారికంగా అందజేస్తున్న విద్యుత్ మీటర్లను బిగించుకోవాలని ఆ శాఖ విజిలెన్స్ ఏడీ రఘు దళిత కాలనీవాసులకు సూచించారు. మండల కేంద్రంలోని దళిత కాలనీలోని కాలనీవాసులకు విద్యుత్ అధికారులతో కలిసి ఆయన విద్యుత్ మీటర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీ పథకాల్లో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తుందన్నారు. దళిత, గిరిజన కాలనీవాసులు తమ ఇంటికి విద్యుత్ వినియోగం కోసం రూ.1080 చెల్లించి మీటరు బిగించుకోవాలని, జీరో కరెంట్ బిల్లు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇతర కులాలకు చెందిన వారు మీటర్ కోసం రూ.1850 చెల్లించాలని సూచించారు. విద్యుత్ మీటర్లు పెరిగినట్లయితే దానికి సరిపడా వోల్టేజ్ అందించడం కోసం అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం జరుగుతుందన్నారు. మీటర్లు లేక విద్యుత్ వైర్లకు అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే విద్యుత్ ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ విద్యుత్ శాఖకు సహకరించి ప్రతి ఇంటికి మీటర్లు బిగించుకొని అధికారికంగా విద్యుత్ వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు కూడా సహకరించి మీటర్లు బిగించుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏఈలు శ్రీధర్, శంకరయ్య, లైన్‌మెన్ సంతోష్, జేఎల్ఎం విష్ణు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

'సఖి' సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

ఐనవోలు : సఖి–వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్యలో వీఓ సభ్యుల సమక్షంలో సఖి–వన్ స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన సదస్సు ఏపీఎం రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. విడిపోయే భార్యాభర్తలకు కౌన్సెలింగ్, వరకట్న, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తి తదితర వేధింపులకు సంబంధించిన అంశాలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. సమస్యలు ఉన్న మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయం సఖి కేంద్రం ద్వారా అందించబడుతుందని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోని సాధారణ మహిళలకు సఖి సేవల గురించి వివరించాలని కోరారు.

పరామర్శ



ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన బొల్లెపల్లి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేశ్ శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మహేష్, జైపాల్, పరమేశ్ తదితరులు ఉన్నారు.

మాణిక్యాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

ఎల్కతుర్తి: పిల్లాపాపలను చల్లంగా చూడు రేణుకా ఎల్లమ్మతల్లి అంటూ గౌడ కులస్తుల ఇలవేల్పు అయిన రేణుకా ఎల్లమ్మకు పెద్ద ఎత్తున బోనాలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ గ్రామంలో శనివారం రాత్రి మహిళలు నైవేద్యం వండిన బోనాలు నెత్తినబెట్టుకొని డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. నైవేద్యం వండిన బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

హరీశ్‌రావు.. రాజీనామాకు సిద్ధంగా ఉండు



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

హసన్‌పర్తి: ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈక్రమంలో రాజీనామాకు మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్ధంగా ఉండాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి అన్నారు. రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో అమలు చేయడానికి మంత్రివర్గం ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయాన్ని రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షించారు. ఈ మేరకు కిసాన్ కాంగ్రెస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కిట్స్ క్రాస్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ తప్పదన్నారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారంటీలు అమలవుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, మాజీ సర్పంచ్‌లు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, మదన్ గౌడ్, సమ్మిరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పొన్నాల రఘు, కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, టీఆర్ఏకే రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు మేర్గు రాజేష్, అనిల్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చరణ్, తాళ్లపల్లి రమేష్, రామంచ ఐలయ్య, డాక్టర్ రవియాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పరకాల : సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ జిల్లా నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ ప్రకటన చేసిన సందర్భంగా పరకాల, దామెర, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, ఐనవోలు, ఆత్మకూరు మండల కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు శనివారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, స్థానిక ఎమ్మెల్యేల చిత్రపటాలకు మండల కేంద్రాల్లో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దామెర : పాలాభిషేకం చేస్తున్న రమణారెడ్డి



ఆత్మకూరులో..



ఎల్కతుర్తిలో..



భీమదేవరపల్లిలో..



ఐనవోలు : అంబేడ్కర్ సెంటర్‌లో పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ మార్నేని మధుమతి

కాంగ్రెస్ శ్రేణుల అసహనం

ఐనవోలు : మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రెండుచోట్ల పాలాభిషేకం చేయడంతో కాంగ్రెస్ శ్రేణులు విస్మయానికి గురై అసహనం వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశాల మేరకు ఒకేచోట నిర్వహించాల్సిన కార్యక్రమం రెండు చోట్ల జరగడం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నాయకులు ఈగోలకు పోయి నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్‌లో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని సీనియర్ నేతలు ఆవేదనతో పాటు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని నాయకులందరినీ ఒకే తాటిపైకి తీసుకురావాలని సీనియర్ నాయకులు, పార్టీ శ్రేయోభిలాషులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సిల్వర్‌జూబ్లీ వేడుకలు



వేదికపై సీనియర్ ప్రొఫెసర్లతో పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: కిట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. అనంతరం సీనియర్ ప్రొఫెసర్లను సన్మానించారు. కార్యక్రమంలో వసంత టూల్స్ అండ్ క్రాఫ్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్, కిట్స్‌వా – నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు దయానంద్‌రెడ్డి మాట్లాడారు. యువ వర్ధమాన ఇంజనీర్లు నాణ్యత, నైపుణ్యాల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అనంతరం అతిథికి మెమొంటో అందించి సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంత రావు, కిట్స్ యాజమాన్య వర్గసభ్యులు ఇ.వెంకట్రామిరెడ్డి, ఎ.హరీష్, ప్రొఫెసర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

సమాన విద్య, వైద్యం కోసం పోరాడుదాం



డీఎస్ఏ నూతన కార్యవర్గ సభ్యులు

కేయూ క్యాంపస్: సమాన విద్య, వైద్యం కోసం పోరాడుదామని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ పిలుపునిచ్చారు. కేయూలోని దూరవిద్యా కేంద్రంలోని జాఫర్ సెమినార్ హాల్‌లో అసోసియేషన్ నూతన సంఘాన్ని శనివారం ఎన్నుకున్నారు. డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్‌గా శ్రావణ్, కోకన్వీనర్లుగా జిగర అనిల్, మున్నా గణేష్, ఉప్పుల శివ, గుండాల రమేష్ ఎన్నికయ్యారు. అనంతరం శ్రావణ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాడాలని సూచించారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల అమలుకు అసోసియేషన్ పోరాడుతోందని వివరించారు. సమావేశంలో డీఎస్ఏ నాయకులు పవన్, శివ, నాగరాజు, అనిల్, శరత్, రవికుమార్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

'జీపీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'



పర్వతగిరి : అవకతవకలకు పాల్పడుతున్న నేపథ్యంలో మండలంలోని భట్టుతండా–2 గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు శనివారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమించుకుని, ఇష్టారీతిన తీర్మానాలు చేసి బిల్లులు చెల్లిస్తున్నాడని ఆరోపించారు. ఉపాధి పనిచేయని వారికి డబ్బులు చెల్లిస్తున్నాడని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆటోను దుర్వినియోగం చేస్తున్నాడని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.